చేయిచాచినట్లయింది. పెళ్లికొడుకు "మరినీకు స్వేచ్ఛలేదు. బురకా వేసుకో! మనం ఇప్పుడు మహమ్మదీయులం" అన్నాడు. ఆమె "నిన్న నేను తొడిగిన రయిక యీ ప్రదేశమందు చిరిగి పోయి కనబడుతూవుంది. అదిక్కడ కెలావచ్చింది?" అని పృచ్ఛించింది మగనిముందు అతి నగ్నంగా తాను నిలుచుండి. "అవును. నీవు పారేస్తే సైకిలు రిక్షాను చుట్టుకువచ్చింది యీ ప్రాంతానకు. ఈ ప్రాంతానకన్న మాటేమిటి? ఏప్రాంతానకైన పోగలదు. అది హిందూమతానకు చెందింది. దాన్ని గాల్లో కలిసి పోనియ్యి. మరి అవంక చూడకన్నాడు పెళ్ళికొడుకు.

పెళ్ళికొడుకు అతీ రస్సాగా వున్నాడు. నల్లటి బూట్సు గీట్సు తొడిగి. మతంపేరిట అందాన్నంతనూ బురకాలో కప్పెట్టి నట్టు కప్పెట్టి తాను ఒక మతం అవలంబించినందుకు లజ్జపడింది.

చినిగిన రయిక ఆ పెళ్లికూతురుయొక్క అందాన్ని వెక్కి రించినట్టు ఆరుబయట నిలిచివుంది. కథ కంచికి వెళ్లింది-మనం మన మంచంమీద......

... ... ... ... ...

## మనమందరం నిరపరాధులం!

తోచనప్పుడల్లా ఓసారి రైలెక్కి అటు చెన్నపట్నమో యిటు విశాఖపట్నమో చూచిరావడం పరమేశ్వరాని కలవాటు. పరమేశ్వరాని కుంటాయి 40, 45 ఏళ్లు. మగాడు కాబట్టి అనుకున్నది తడువుగా "టై" వేసుకు "స్యూట్‌కేసు" పుచ్చుకు "రిస్టువాచీ" చూచుకుంటూ ఇంటి మెట్లుదిగి వెడుతూవుంటే ఇంటిల్లిపాదికన్నీ "ఇతను వెడుతున్నాడు! ఇక్కడికి వెడుతున్నాడు?" అనే మీమాంసకన్న "ఏం శకునం ఎదురొస్తువుందా ఇతగాడికి?" అనేదే హెచ్చు మీమాంస.

ఇటు విశాఖపట్నం అటు చెన్నపట్నం తనకు ప్రయాణపు మేరలు అని పరమేశ్వరం అనుకోవడములో ఓ అందంవుంది. ఓ ఆనందంవుంది–ఆ మధ్యది అంతా ఆంధ్రదేశమని ఆ చివరకో ఈ చివరకో జేరుకుంటే సముద్రం సంతోషము, చల్లదనము కలుగజేయక మానదని—

ఆనాడు బయలుదేరేముందు తన పడగ్గది నిలువుటద్దంలో వోపర్యాయము తనషోకు చూచుకుంటూవుంటే పరమేశ్వరం భార్య వెనకనుంచో ప్రక్కనుంచో వచ్చి చటాల్న వోముద్దు ఇవ్వబోయింది. ఆమెక్కూడా దాదాపు అతగాడివయస్సే. అయితేం అతి యౌవనార్భాటముగా మిక్కిలి ఉదుటుగా తగని డబ్బాటుగా ఆమె తనంతనవలచి ఏదో తెలివితక్కువపని చేయబోతూంటే పరమేశ్వరం–"ఉండు! ఆవల రైలుదాటిపోతుంది! ఉండు!" అంటూ గిజాయించుకు యీవలబడ్డంత తొందర కనబరుస్తూ స్టేషన్ చేరుకున్నాడు. పరమేశ్వరం భార్య "ఇంతకన్న మించిన పని మగవానికుంటుందని నేనెన్నడూ అనుకోలేదు. ఆడదిలేని రైలు ఆడదిపోని రస్తా వుంటాయిటండీ! ఆడది అంటే అంత విషంగా చూడకూడదు సుమండీ! రాండి! వెనక్కు మళ్ళండి! రేపు వెడుదురుగాని!" అని అంటూనేవుంది. ఆమె వంటింట్లో అనుకుంటూనేవుంది. స్టేషన్లో పరమేశ్వరం రైలెక్కేశాడు. ఎక్కి కూర్చున్నాడు అధమతరగతి పెట్టెలో. అతిదర్జాగా పరుపుల పెట్టెలో వొరిగినట్టు, విసనకర్రల పెట్టెలో విరమించినట్టు!

తక్షణం రైలు సాగజొచ్చింది. సాగుడుతూగులో అతను ఇటు అటూ తేరిచూచి–"బండంతా ఖాళీగా వుండడమేకాకుండా యీ బండిలో ఆడవాళ్ళు వొఖళ్లూ లేకపోవడము చాలా ఆశ్చర్యముగా వుంది" అని కారణం ఆలోచిస్తూ తన భార్య తనతో ఆక్షణమందు వుండివుంటే పందెం తానే నెగ్గానని చెప్పివేసేటంత ఉత్సాహస్థాయికి మానసికంగా లేచిపోయాడు! 'బ్రై'కి సల్లిచ్చాడు.

తరువాత స్టేషన్ వచ్చింది రైలాగింది. పిలపిలమంటూ పరమేశ్వరం కూర్చున్న బండిలోకి పదివేలమంది ఎక్కినట్టుగా ఎక్కిపోయారు జనం కిటికీలంట, గేట్టంట, ప్లాట్‌ఫారమ్వున్న వేపునుంచి లేనివేపునుంచి కూడాను. "ఓయి! చచ్చానర్రో" అని ఒకడోమూల అరుస్తూవుంటే రెండోమూలనుంచి "బావయ్య ఎక్కడా? అత్తయ్యో?" ఇలా ఒకళ్ళగొంతు లొకళ్ళు తెలిసికో లేని మచ్చుగా రణగొణధ్వనితో నిండిపోయింది బండి అంతా. ట్రంకుల చప్పుళ్ళు, గాజులు చప్పుళ్ళు రైళ్లచప్పుళ్ళను మించి వున్నాయి. తలుపులు మరి మూతలడలేదుగదా దిగడం ఎటువైపు నుంచో అనేదికూడా తెలుపుడుగావడములేదు. పరమేశ్వరం అప్పుడనుకున్నాడు. "ఇందుకే అక్కడంత ఖాళీగావుంది" అని అనుకొంటూ గాలికోసము అటున్నతల ఇటుత్రిప్పుకొనేంతలో ఒక 60 ఏళ్ళ ముసిల్ది నల్లతుమ్మచాయది "ఉసింత జరుగుండీ?" అంది.

పరమేశ్వర్వం "అలానించో! అస్థలం నీకుచాల్లే" అన్నాడు. అన్నాడోలేదో ఇరవైళ్ళ కుఱ్ఱది "ఏం నువ్వే టిక్కట్టిచ్చావా? మేమివ్వలేదా?" అని కసిరింది. "నీవూ ఇస్తే నీవూ కూకో" అంటూ పరమేశ్వరం అంగుళం జరిగాడు. అంగుళం జరిగేలో అకుఱ్ఱది అలా చతికిలబడి తనచెయ్యి అలా పరమేశ్వరంమీదికి పోనిచ్చి ఏలా వుసులో అలాకూచుంది. ముసిల్ది—"పోనీ నీవు పైకెక్కితే! మహదేవమ్మగారొచ్చి అక్కడ కూచుంటారు" అంది. "మరి నువ్వో?" అంది కుఱ్ఱది. నేనిల్లా ఈపక్కను కూకుంటాను అని అపళంగానే పరమేశ్వరం రెండోపక్కను ఇరుక్కుంది. మరి కుఱ్ఱది తన చేయితీసుకొని "మహదేవమ్మగారూ! ఇలా రండి ఇక్కడ కూకోవచ్చు, కావలసినంత చోటుంది" నేను పైకెక్కి అటుకుమీద కూకుంటాను. అంటూ చీరపైకెగ్గట్టి ఝూంమంటూ ఎగిరి పైని అటుకుమీద కూర్చుంది. మహదేవమ్మ గారు జనాన్ని తోసుకొంటూ చెమటోసుకుంటూ "మా ఆయన

ఎక్కడున్నారో? ఎక్కడెక్కారో" అనుకొంటూ పరమేశ్వరం వున్నచోటికి వచ్చి బండికంతకూ అక్కడే కాళీ అన్నట్టు కూర్చుంది. మహదేవమ్మ లావుపాటి మనిషి. 40 ఏళ్లు వుంటాయి. "పిల్లాణ్ణెంచాశారు?" అని అడిగింది మహదేవమ్మను నల్లటి ముసిల్ది. "ఇక్కడున్నాడు! ఇదుగో!" అని చూపించింది పైకెగిరిన కుఱ్ఱది. "ఓరిభడవా! పైనున్నావట్రా!" అని ముసి ముసి నవ్వు నవ్వింది మహదేవమ్మ" "నేనేకాదు నాన్నకూడా ఇక్కడే వున్నాడు" అంటూ తండ్రిని చూపాడు కుఱ్ఱాడు. అప్రక్కనే తండ్రినవ్వుతూ మహదేవమ్మకో నారింజకాయ ఇచ్చి "వల్చుకుతిను, ఇంకా అన్నవరం శానాదూరముంది" అన్నాడు. మహదేవమ్మ "మీరున్నారనే పైకెగిరికూచుంది!" అంది ఎవర్నో చూపించినట్టు యువతిని చూపిస్తూ. "నీవు ఎగర్లేవు! ఒకళ్లు ఎగిరితే చూళ్లేవు!" అన్నాడు మహదేవమ్మ భర్త. నల్లటి ముది మనిషి "బస్తాసంచీ అరటి ఆకులు ఏమూలపడివున్నాయో?" అని అడిగింది పరమేశ్వరంమీది కొరిగిపడుతూ—పరమేశ్వరం "దిగాక గార్డును అడుగు" అంటూ గదిమాడు. మహదేవమ్మ "గార్డుదొర సాయపడకపోతే నేతలుపట్టకేపోదునో—" అంటూ విపరీతంగా నవ్వింది. అనవ్వుకు మహదేవమ్మ పక్క లుబికి పోయాయి. పరమేశ్వరం పక్కలు నొక్కుకుపోయాయి!

అన్నవరం స్టేషను వచ్చింది. బండికిబండి అంతా ఖాళీ! పరమేశ్వరం తన భార్యా నొక్కసారి తలపోసికొన్నవాడై "మరి ఆడది ఎక్కకుండా ఈ బండిని కాపాడాలి" అని శపథం పట్టి నట్టు తలుపుదగ్గర నిల్చున్నాడు తుని వచ్చేసరికి.

తునిదగ్గర ఓ పితంతువు "మిమ్మల్నెక్కడో చూచినట్టు వుందండీ!" అంది. పరమేశ్వరం లేదనలేక అదోరీతిగా దారి చ్చాడు. అమె తిన్నగా బండిలోకి ఎక్కి "ఇది ఆడవాళ్ళబండా? మగవాళ్ల బండా?" అనడిగింది. పరమేశ్వరం "మగవాళ్లకు

వేరేబళ్లు లేవండీ" అన్నాడు. ఆమె 'పాపం' అంది. పరమేశ్వరం ఆమె జాలిలో నిజాలు కనిపెట్టలేకపోయాడు. ఆమె "మీ బండి లోంచి దిగినవాళ్ళంతా అడవాళ్ళులాగే వుంటే అడిగానండీ" అంది. పరమేశ్వరం "ప్రయాణములో ఆడ మగ భేదము పాటించడము వదిలేశాను" అన్నాడు. ఆమె "నాదీ అదేతత్వం!" అంది. ఇలా పిచ్చాపాటీ ఆడుకుంటూ పాడుకుంటూ ఆ యిద్దరూ రైల్తో సమానంగా కాలాన్ని వెళ్ళబుచ్చుతూవుంటే అనకాపల్లి స్టేషన్ వచ్చింది. "ఇహ సెలవు నాకు" అంది వితంతువు. "ఇక్కడేపని మీకు?" అన్నాడు పరమేశ్వరం. "ఏమీలేదండీ! బొజ్జన్నకొండ చూడ్డానికి వచ్చాను" అంది. పరమేశ్వరం అప్పుడనుకొన్నాడు. "బౌద్ధమత భిక్షురాండ్రింకా వున్నారు!" అని. "అవిణ్ణీ అలాచూస్తూ తాను ఒకింత 'స్త్రీ' అనే పదార్థంతో సమాధానపడ్డట్టు ఇదయ్యాడు. ఆమెలోని విరక్తిమార్గమే పరమేశ్వరానికి అచూపు ప్రసాదించింది అని మనము అనుకోవచ్చును.

పరమేశ్వరం మరో గంటకు వాల్తేరు చేరుకోగల్గాడు. అడపొరుగు లేకుండా తన దరిమానాకు మళ్లా రాకుండా. అయితే వాల్తేరు ప్లాట్‌ఫారమ్‌మీద ఇరవైవేలమంది దిగినట్టుగా దిగారు జనం. ప్రతీ రెండోవ్యక్తీ ఆడదే! "సింహాచలానికి బండెప్పుడు? జగన్నాథానికి దారెట్లా?" అంటూ.

పరమేశ్వరం "రైలువాళ్ళు ఎక్కవద్దన్నకొద్దీ ఎక్కవెడుతున్నారు. ఈప్రజకు అంతులేదు" అని ఎవర్నిచూచో ఒక్క నిట్టూర్పు విడిచాడు. ఎవర్నిచూచి ఏమిటి? ఒక యిల్లాలు ఎన్ని బంగారపు వస్తువులు పెట్టుకోవాలో అన్నీ పెట్టుకుని భుజాన్ని ట్రంకుపెట్టుకు నడుస్తూవుంది. "కూలీని కుదుర్చుకోరాదటమ్మా" అని అనబోయి మళ్లీ నాలిక వెనక్కి తీసికొన్నాడు పరమేశ్వరం. ప్లాట్‌ఫారమ్ మీద ఒకామె "ఏమండో?" అని కేకేసింది. పరమేశ్వరం తిరిగి చూచాడు. "స్టేషన్ అవలకు దారెట్లా?" అంది.

పరమేశ్వరం "అందరూ వెడుతూన్నట్టే" అన్నాడు. స్టేషన్ వెలపల మరో ఆవిడ పరమేశ్వరాన్ని వెంటాడించినట్టు కూడా కూడా నడుస్తూ "ఊళ్లోకి దారెట్లా?" అంది. అప్పటికప్పుడే రాత్రి పంద్రెండయింది. వీళ్ళకూ వాళ్ళకూ చెబుతూవుంటే తన అర్జంటుపనికి మోసమువస్తుందనో ఏమో ఆమెతో "ఇల్లుకనబడేదే వూ"రని ఓరిక్షా తాను కుదుర్చుకుని ఎక్కికూర్చున్నాడు. "ఓరేవ్! ఇది నావొక్కడికే కుదుర్చుకుంటు వున్నాను"అంటూ ఆ కూడాకూడా వచ్చినావిడ ఆమాటవింటూ మరో రిక్షావాణ్ని పిలిచి "ఒరేవ్ ఇది నావొఖ్ఖర్తికే కుదుర్చుకుంటూవున్నాను తిన్నగా సముద్రపొడ్డుకు పోనియ్యి" అంది.

పరమేశ్వరానికి ప్రాణం కతక్ మంది. ఆమె గమ్యస్థానము తన చెవినిబడ్డప్పుడు సముద్రపొడ్డున ఇంత అర్ధరాత్రినికూడా అంగనా సంపర్కం తప్పదుగాబోలునురా తనకనే ఆలోచనలో పడ్డాడు. ఇద్దరకూ చెరో రిక్షాకంటె ఒకేరిక్షాలో యిద్దరూపోతేనో అని తలపోశాడు. ఎంచేత అంటే ఏలాగూ సముద్రపొడ్డున తనను ఆమె పలకరించక మానదు. ఆ పలకరించడం పలకరించడం రిక్షాలోనే పలకరించుకుంటే వదిలిపోతుందికదూ! అయితే రిక్షావాళ్ళు వొప్పుకోవద్దూ?

వూరంతా బ్లాకౌట్ సముద్రపొడ్డున పుచ్చపువ్వుల్లా వెన్నెల. వూరంతా మాటుమణుపు! సముద్రపు వొడ్డున కెరటాలగునుపు! అలావున్న వొక్క నిమిషములో "ఎలెర్టు" రోదనం వినిపించింది. చంద్రుడు కూడా అదివిని ఏదోమబ్బులోకి ప్రజలు ట్రెంచీల్లోకి దూరినట్టు దూరిపోయినాడు.

రిక్షావాళ్ళు మరిలాగడం ఆపేసి "మేం ఇద్దరము ఒక రిక్షాలో కూకుంటాం! మీరిద్దరూ ఒక రిక్షాలో కూకుండండి!" అని ప్రయాణీకుల్ని హెచ్చరించారు. హెచ్చరిస్తూ గబగబా పెగూళ్ళు కప్పేశారు.

పరమేశ్వరానికి రిక్షావాళ్ళ హెచ్చరింపు అర్థముకాలేదు. వాళ్ళను ఎవళ్ల రిక్షాక్రింద వాళ్ళను కూర్చోమంటాడు. కూర్చో మనడమే కాకుండా తనొక్కనికోసమే తన రిక్షా కుదుర్చుకున్నా నంటాడు. కొత్తపణతి వెలవెలబోతూ "కూర్చుందామండీ" మనమిద్దరము ఒక రిక్షాలో–ఈ రోదనధ్వని నన్ను కరిగించి సెలయేరుగా జేసేస్తూ వుందండీ!" అంటూ పరమేశ్వరం రిక్షాను జేరుకుంది.

రిక్షావాళ్ళు "చస్తే మాం ఇద్దరం ఓకాడకూర్చుని ఒకళ్ళ చేతుల్లో ఒకళ్ళం చచ్చిపోతాం! దణ్ణాలు మీకు" అంటూ ఖాళీ రిక్షాలో ఎక్కికూర్చున్నారు. పణతి "చూశారా! మీరెవరో? ఎవరైతేం?–మనకు ఆ రిక్షావాళ్ళ కన్యోన్యంవున్నంత అభిమానం అత్యంతప్రేమ చదువుకున్న, మనకు విజ్ఞానంవున్న మనకు లేదండీ!" అంది. అలా పణతి అంటూవుంటే పరమేశ్వరం చేతులుచాచి ఆమెను అందిపుచ్చుకుని "మనం అన్యోన్యం ఉత్తిఉత్తి చేతుల్లో చావడం ఏమిటి? అన్యోన్యాలింగనంలో చనిపోదాం! ఎక్కికూర్చో ఈగూడు క్రింద!" అన్నాడు. అని అన్నంత అభిమానం క్రియారూపకంగా కాపరిచాడు.

ఆ ఎలెర్టు, ఎలెర్టు ఇరవై నిమిషాలుంది! ప్రపంచమంతా స్తంభీభూతమైనట్టుంది. పరమేశ్వరం ఓపికపట్టలేక "నిర్భా గ్యులం మనమీద బాంబులు పడవనుకుంటాను" అన్నాడు. పణతి "నిర్భాగ్యులం అనకండి! అంటే ఈ నిరంతర ప్రేమికుల మీద బాంబులు పడవనండి" అంది.

అంతట్లో ఆల్‌క్లియర్ ఊదబడింది. రిక్షావాళ్లు "సర్దుకోండి! తల్లీ మీరిక్షాలో మీరు! నిరపరాధులమీద ఎందుకు వేస్తాడు వాడు బాంబులు! మనమేం అపకారం చేసామని వస్తాయి శత్రు విమానాలు?" అన్నారు.

ఈమాటు పణతియొక్క రిక్షా ముందు నడుస్తూవుంది. ఆమె వెనుదిరిగి "నిజమండో! మీరెవరో? ఎవరైతేం? ఈరిక్షా

వాళ్లు అన్నమాట ముమ్మాటికీ నిజం! నిరపరాధులం మన మందరమూ! మనమీద ఎందుకు పడతాయి బాంబూలు? మన మీద ఎందుకు ఎగురుతాయి శత్రువిమానాలు" అంటూ చిరునవ్వు నవ్వింది!

ఆకాశం మీద చంద్రుడు మేఘంలోంచి వెలువడ్డంచూస్తూ పరమేశ్వరం "కొత్తవెన్నెల్తో ఆమె చిరునవ్వును పోల్చే" నన్నాడు.

... ... ... ... ...

## కారియర్ భోజనం

విద్యార్థి వివేకానందరావు కళాశాలా విద్యార్థే కాకుండా వసతి గృహనివాసి కూడాను. బంధువులు మిత్రులు ఎవరైనా ఎప్పుడైనా అతణ్ణి "మీ హాస్టల్లో భోజనం ఎలావుంటుందోయ్?" అని అడిగితే— "ఏమిటి చెప్పండి హాస్టల్ మీల్సు హెూమ్లీగా వుండవండీ" అనో "వుండవురా?" అనో జవాబు చెప్పేసెయ్యడం పరిపాటి. ఈ పరిపాటితోపాటు వసతి గృహంతో సంబంధం వదుల్చుకుందా మనే తలంపుకూడా అతనిలో సోపాన వారీగా రేకెత్తింది.

మొదటి సోపానం వసతిగృహంలో భోజనంమాత్రమేచేస్తూ చదువుకునే గది వేరే రోమవీధిని ఏర్పాటు చేసుకోవడం-రెండవ సోపానం ఆ గదిక్రిందదల్లా మేడమీద గదిగా చేసుకోవడం-మూడవ సోపానం కళాశాలా వసతిగృహంలో అల్పాహారం కాఫీ తేనీరు మానివేసి ఏతత్పదార్థాలు వెలువల ఒకానొక పెద్ద భోజన కాఫీహెూటల్లో తీసికోవడం.

ఈ మూడవ సోపానం ఎక్కాక ఓనాడు ఏంజరిగిందీ అంటే వివేకానందరావు-నేనన్న-పెద్ద భోజన కాఫీహెూటల్లో గుండ్ర బల్లదగ్గరనున్న కుర్చీమీద కూర్చుని పెసరట్టు ఉప్మా రెండూ మిళితంగా సొంతచేత్తో మణుచుకు నోటపెట్టుకుంటూ ఉదయం